క్లుప్తంగా

11 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

కొల్లిపర: ఈ నెల 11 నుంచి 14 తేదీ వరకు కొల్లిపర గ్రామంలోని కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు, గణపతి, నాగ ప్రతిమల స్థాపన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పరాశరం సీతారామాచార్యులు, వంశ పారంపర్య ధర్మకర్త అళ్ల సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయలయంలో వివరాలు వెల్లడించారు. 11న స్వామికి విశేష అభిషేకం, పూజలు, 12న నిత్య, నవగ్రహ, హనుమత్ హోమాలు, వాస్తు శుద్ధి, 13న మృత్యుంజయ, నారసింహ హోమాలు, 14న నాగవల్లీ దళార్చన, నాగ ప్రతిమలు స్థాపన, అష్టోత్తర హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గాయని కత్తి సౌజన్యకు సత్కారం



తెనాలి: ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఎన్టీఆర్ వ్యక్తిత్వం, రాజకీయ జీవితంపై చర్చా వేదిక నిర్వహించారు. అమరాచారి, ముత్తె శిరీష ఎన్టీఆర్ పాలన, సినిమాల ప్రభావం అనే అంశాలపై ప్రసంగించారు. అనంతరం ప్రముఖ గాయని కత్తి సౌజన్యను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వర రావు, చెరుకుమల్లి సింగారావు, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, నన్నే సాహెబ్, పినపాటి సురేష్, గూడపాటి రాంబాబు, వెనిగళ్ల శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్, స్పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యడ్ల లింగయ్య కాలనీలోని యానాది కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ జుకుర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో మొత్తం 110 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. వైద్య పరీక్షలు చేశాక, ఎక్కువగా రక్త హీనత, ఛర్మ సంబంధిత వ్యాధులను గుర్తించినట్లు వైద్యులు చెప్పారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. స్పార్క్ ఆర్గనైజేషన్ తరఫున షర్మిల, సినీదర్శకుడు దిలీప్‌రాజా, మాధవ్, సురేష్, రమేష్, రాజశేఖర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

యువతిపై దాడి

తెనాలిరూరల్: ఆకతాయిలను ప్రతిఘటించిన యువతిపై దాడి చేసి, గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఐతా నగర్‌కు చెందిన ఓ యువతి శనివారం రాత్రి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. కొందరు గుర్తు తెలియని యువకులు ఆమెను కామెంట్ చేశారు. దీంతో యువతి వారికి ఎదురు తిరిగింది. దీంతో ఆ యువకులు ఆమెపై పదునైన వస్తువుతో దాడి చేశారు. యువతి చేతులకు గాయాలయ్యాయి. బాధిత యువతి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

పేద ముస్లింలకు వైద్య సేవలు

పిట్టలవానిపాలెం: పేద ముస్లిం పిల్లలకు ఉచిత వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు పొన్నూరు ఫాతిమా వైద్యశాల వైద్యులు డాక్టర్ నూరుల్లా తెలిపారు. ఆదివారం చందోలు పరిధిలోని మదర్‌సా అరేబియా అతారుల్ ఉలుమ్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మే నెలలో మూడు రోజులు చందోలులో వైద్య శిబిరం జరుగుతుందని, ప్రతి నెలా ఆదివారం చిన్నమట్లపూడి, మంగళవారం పొన్నూరులో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అతహర్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడి అరెస్ట్

తెనాలిరూరల్: యువతిని వేధిస్తున్న యువకుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం జగ్గడిగుంటపాలేనికి చెందిన దామర్ల చిరంజీవి అదే గ్రామానికి చెందిన యువతి వెంటపడుతూ వేధించేవాడు. బాధితురాలు గతంలో ఫిర్యాదు చేయగా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జైలు నుంచి తిరిగి వచ్చాక యువతి గురించి చెడుగా ప్రచారం చేయడమే కాకుండా, మరలా ఆమె వెంట పడుతూ వేధిస్తున్నాడు. దీంతో బాధిత యువతి పోలీసులను ఆశ్రయించగా నిందితుడిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి తెలిపారు.

మందుబాబులపై కేసు నమోదు

తెనాలిరూరల్: మందు బాబులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని పోలీసులు ఆదివారం రాత్రి గుర్తించారు. 8 మందిని అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేశారు.

సుదీర్ఘ సమస్యలకు పరిష్కారం.. ఫ్యామిలీ డాక్టర్

- ఇంటి ముంగిటకే వైద్య సేవలు
- పేదల పాలిట వరంగా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం
- దీర్ఘకాలిక రోగులకు..ఇంటి వద్దే చికిత్స
- తగ్గిన ఖర్చులు, వైద్యుల సూచనలతో ఆరోగ్యంపై భద్రత



ఇంటి వద్దనే రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొల్లిపర: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదల పాలిట వరంగా మారింది. గ్రామాల్లో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్య శ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకొన్నవారు, గర్భిణులు, బాలింతలు పరీక్షల నిమిత్తం గతంలో పట్టణాలకు(తెనాలి, గుంటూరు, విజయవాడ) వెళ్లేవారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలులోకి వచ్చిన అనంతరం నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్లకే వైద్యులు వచ్చి పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. ట్రయల్ రన్ ద్వారా వైద్యాధికారులు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు చేశారు. నేడు పూర్తిస్థాయిలో ప్రత్యేక షెడ్యూల్ ద్వారా గ్రామాల్లో సుమారు 4 నుంచి 7 రోజులు వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో గ్రామీణులకు ఎన్ని జబ్బులు చేసినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టణాలకు పరుగు పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానానికి విశేష స్పందన కనిపిస్తోంది.

తెనాలి నియోజకవర్గంలో ఇలా..

తెనాలి నియోజక వర్గంలో 38పైగా గ్రామాల్లో 250 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, సుమారు 20 వేల మందికి వైద్యులు సేవలందించారు. దీంతో వారిలో ఆరోగ్యంపై భరోసా కలిగింది. తమకు ఏ జబ్బు చేసినా ప్రభుత్వం ఉందిలే అన్న ధీమా పెరిగింది. ముఖ్యంగా షుగర్, బీపీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయస్సుతో సంబంధం లేకుండా ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ప్రతి నెలా పేదలు వీటి వైద్యానికి, మందులు కొనుగోలుకు డబ్బులు లేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వమే వైద్యులను పంపించి, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేయిస్తోంది. ట్రయల్ రన్‌లో భాగంగా నియోజకవర్గంలో ఏప్రిల్‌లో కొలకలూరు, సంగం జాగర్లమూడి, మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సుమారుగా గర్భిణులు 1,200, బాలింతలు 900, రక్త హీనత 20, బీపీ 3,950, షుగర్ 4,500, జనరల్ ఓపీ 7,500, టీబీ ఇతర రోగులు మరో 100 మందికి వైద్య పరీక్షలు చేశారు.

ఇంటి వద్దకే వైద్యం



గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇంటి వద్దకే డాక్టర్ వచ్చి వైద్యం చేస్తున్నారు. మందులు ఎప్పుడు వాడాలి, ఎలా వాడాలి, జబ్బుకు సంబంధించిన జాగ్రత్తలను చెప్తున్నారు. చాలా మంచి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. సీఎం జగన్ పేదల కోసం అన్నీ కార్యక్రమాలు చేస్తున్నారు.

– భీమవరపు గురవారెడ్డి, కొల్లిపర.

అందుబాటులో ఉంటున్నాం



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. గ్రామ హెల్త్ క్లినిక్‌లకు వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు, ఆశ వర్కర్లు అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ రోగులకు సేవలు అందిచడమేకాకుండా.. గర్భిణులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం, ఆరోగ్యశ్రీ చికిత్సలు చేయించుకొన్న రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ చిక్కాల లక్ష్మి సుధ, మున్నంగి పీహెచ్‌సీ, కొల్లిపర.

ఉద్యోగ ప్రస్థానం, పదవీ విరమణ తెనాలిలోనే..

తెనాలి: తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ ఉద్యోగ విరమణ సభ ఆదివారం స్థానిక కొత్తపేటలోని ఓ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఆహ్వాన కమిటీ కన్వీనర్ డీఎల్ కాంతారావు సభకు అధ్యక్షత వహించారు. తెనాలిలో ఉద్యోగ ప్రస్థానం ఆరంభించి, 41 ఏళ్ల సర్వీసులో వివిధ పదవులను చేపట్టి, డివిజనల్ సూపరింటెండెంట్‌గా తిరిగి ఇక్కడే పదవీ విరమణ చేయటం సంతోషకరమని కాంతారావు పేర్కొన్నారు. అధికారిగా ఉద్యోగులు, ఉన్నతాధికారుల మన్ననలు పొందిన కొల్లూరు రమేష్, ఉమ్మడి రాష్ట్ర ఇన్‌స్పెక్టర్/ఏఎస్‌పీ అసోసియేషన్‌కు దశాబ్ద కాలం నాయకత్వం వహించినట్లు వక్తలు గుర్తుచేశారు. అదే విధంగా పోస్టల్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2017 నుంచి రమేష్ నేతృత్వంలోనే నడిచిందని తెలిపారు. తన పదవీ కాలంలో ఉత్తమ సేవలకు గాను ఉమ్మడి రాష్ట్ర స్థాయి అత్యున్నత పురస్కారం డాక్ సేవ అవార్డును 2015లో గవర్నర్ డాక్టర్ నరసింహన్ చేతులమీదుగా అందుకున్నట్లు తెలిపారు. తన విశ్రాంత జీవితం సుఖవంతంగా గడవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. బీవీ సుధాకర్, ఈవీ రావ్, వీవీవీ ప్రసాద్, వేణుగోపాల్, శ్రీధర్‌బాబు, వాసిరెడ్డి శివాజీ, బీవీ రావ్, విద్యాసాగర్, శ్రీనివాస్, పవన్, పోతురాజు పాల్గొన్నారు.



కొల్లూరు రమేష్‌ను సత్కరించిన అతిథులు

పేద ముస్లిం వధువులకు చేయూత



తెనాలి: పట్టణంలోని చినరావూరుకు చెందిన డాక్టర్ జాఫర్ సాదిఖ్ బాషా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పది మంది ముస్లిం పేద పెళ్లి కుమార్తెలకు జెహెజ్ (బీరువాలు, మంచాలు సహా పెళ్లికి కావలసిన వస్తువులన్నీ) ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కో వధువుకి రూ.50 వేల విలువైన వస్తువులతో మొత్తం రూ.5 లక్షలు వితరణచేశారు. ఏటా పేదింటి వధువులకు ట్రస్టు తరపున సాయం చేస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ షేక్ ఖలీల్, కార్యదర్శి షేక్ గౌసియా బేగం తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, అహ్మద్ ఖానె, తాడిబోయిన హరిప్రసాద్, షేక్ నసర్ అహయద్, షేక్ నఫీజ్, షేక్ జిలాని (సిల్వర్), మొహిద్దీనె ఇమామ్, షేక్ షబ్బీర్, షేక్ రహీమ్, షేక్ వసీమ్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛను సకాలంలో రాక అవస్థలు

తెనాలి: రాష్ట్రంలోని అనేక సంస్థల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు సకాలంలో పింఛను రాక ఇబ్బందులు పడుతున్నారని ఏపీ స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్, తెనాలి శాఖ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అనేక మంది వయోభారం, ఆనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, పింఛను రాకుంటే పిల్లలు కూడా చూడని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. పింఛను సమాచారం కోసం వీరంతా ప్రతిరోజూ బ్యాంకులు, సబ్ ట్రెజరీ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీన పింఛను జమయ్యేలా చూడాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రేపల్లె రూరల్: రహదారి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన మోపిదేవి వెంకట వర్మ(21), గత నెల 22న నిజాంపట్నం నుంచి రేపల్లె వస్తుండగా బేతపూడి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి, ప్రమాదానికి గురయ్యాడు. గుంటూరులో చికిత్స పొందుతున్న ఆ యువకుడు శనివారం మృతి చెందనిట్లు తెలిపారు. మృతుడి భార్య షబానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేటి యువతకు 'అల్లూరి' స్ఫూర్తి



అల్లూరి విగ్రహానికి నేతల నివాళి



సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించిన క్షత్రియులు



భట్టిప్రోలులో అల్లూరి విగ్రహానికి నివాళి

పిట్టలవానిపాలెం: నేటి యువతరానికి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి ప్రదాత అని క్షత్రియ సేవా సంఘం సభ్యులు అల్లూరి శివరామరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐ ల్యాండు సెంటరులో ఆదివారం విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 92వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివరామరాజు మాట్లాడారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై ప్రత్యక్ష సాయుధ పోరుకు తెరలేపి, తెలుగు జాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. అల్లూరి విగ్రహం వద్ద కొబ్బరి కాయలు కొట్టి, స్వీట్లు పంచిపెట్టారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బొలగాని సుబ్బారావు వైఎస్సార్, మంతెన వెంకట్రాజు విగ్రహాలకు నివాళులర్పించారు. పార్టీ నాయకులు బొలగాని సుబ్బారావు, రమేష్, మున్నం సుబ్బారెడ్డి, అల్లూరి శివరామరాజు, మదనమోహనరాజు, దేగల రవిరెడ్డి, వేగేశన రామకృష్ణం రాజు తదితరులున్నారు.

అల్లూరి పోరాట పటిమ ఆదర్శం

కర్లపాలెం: మణ్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని క్షత్రియ పెద్దలు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో కర్లపాలెం పాలకేంద్రం వద్ద ఆయన విగ్రహానికి ఆదివారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పెద్దలు, యువకులు తదితరులు ఉన్నారు.

మన్యం వీరుడికి నివాళి

భట్టిప్రోలు: అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆదివారం భట్టిప్రోలు పీహెచ్‌సీ ఎదుట ఆయన విగ్రహానికి వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. విగ్రహ దాత తోటకూర మోహన్‌రావును సన్మానించారు. కమిటీ నిర్వాహకులు బండారు శ్రీనివాసరావు, జంజనం హేమ శంకర రావు, చందలూరి రామకోటేశ్వరరావు, క్రాప రవికుమార్, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, రావూరి సత్యన్నారాయణ మూర్తి, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వీల్‌చైర్ బహూకరణ

రేపల్లె: యలవర్తి కిరణ్ కుమార్, చైతన్య దంపతుల కుమారుడు సాయి సదాశివ లింగ వరప్రసాద్ జ్ఞాపకార్థం అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జానం మురళీకృష్ణకు రూ.1లక్ష విలువ చేసే ఎలక్ట్రికల్ వీల్‌చైర్‌ను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ తమ కుమారుడి జ్ఞాపకార్థం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సంఘం సభ్యులు కృష్ణా, మేకా ఉమా మహేశ్వరరావు, రామకృష్ణ, గౌతమ బుద్ధ పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్యకు ఘన నివాళి

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య భావితరాలకు ఆదర్శనీయులని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య 52వ వర్ధంతి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీపీఎల్, బీహెచ్ఈఎల్ వంటి కంపెనీలతో పాటు వ్యవసాయ అభివృద్ధికి గాజులదిన్నె, వంశధార ప్రాజెక్టులను నిర్మించి, నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఆనాటి బడ్జెట్లో రూ.77 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు పటాన్ రాజేష్, సెక్రెటరీ శీలం సాగర్, మాజీ కౌన్సిలర్ రాంబాబు, శంకర్, డి.రవి, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక తదితరులు పాల్గొన్నారు.



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నేతల నివాళి

విద్యార్థినికి మంత్రి అభినందన

భట్టిప్రోలు: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో భట్టిప్రోలు సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థిని బొందలపాటి శ్రీలక్ష్మి ఉత్తమ మార్కులు సాధించడంతో ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఆశీర్వదించారు. శ్రీలక్ష్మి తల్లిదండ్రులు బొందలపాటి నాగయ్య, రాజేశ్వరీలను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, చుండూరు మండల కన్వీనర్ గాదె శివరామకృష్టారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మాతంగి రత్నకుమార్, కనపర్తి మోహన్‌రావు, చంటి, మోదుకూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని శ్రీలక్ష్మికి స్వీట్ తినిపిస్తున్న మంత్రి నాగార్జున

ఆనాటి స్నేహం..ఒక్కటైన క్షణం

తెనాలిరూరల్: దేశ నలుమూలలా వివిధ రంగాల్లో స్థిర జీవితం. 25ఏళ్ల తర్వాత పాఠశాల స్నేహాన్ని పలకరించిన తరుణం. చదువులమ్మ ఒడి జ్ఞాపకాలను పంచుకున్న ఆనందం. ఆదివారం తెనాలి మోరిస్ పేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హై స్కూలు 1997–98 బ్యాచ్, పదో తరగతి పూర్వ విద్యార్థుల 'ఆత్మీయ కలయిక'లో సంతోషం వెల్లివిరిసింది. ఇందుకు సుల్తానాబాద్‌లోని ఓ హోటల్‌ను వేదికైంది. పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ..వాటిని స్నేహితులతో పంచుకుంటూ.. పూర్వ విద్యార్థులు సరదాగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులు కె.కృష్ణారెడ్డి, పి.లక్ష్మీ ప్రసన్న, పి.ప్రసన్నాంజనేయులు, టి.వెంకటేశ్వర్లు, వి.శాంతకుమారి, ఎం.సత్యనారాయణ, ఎం.సరోజిని, ఎల్.గంగరాజు, ఎం.భవాని, డీవీఆర్ ప్రసాద్, పి.ఉమాదేవి, జేఎల్ఎన్ కళ్యాణి, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.మెర్సీ శారా, ఇందు శేఖర్‌లతో పాటు ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు బషీర్ అహ్మద్‌ను సత్కరించి, తమ గురు భక్తి చాటారు. ఆహ్వాన కమిటీ సభ్యులు అన్నపురెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రామినేని మణికుమార్, దోనేపూడి భాను దివ్యకుమార్, కఠెవరపు రాజు, వేజండ్ల అనురాధ, విజయశ్రీ తదితరులు పర్యవేక్షించారు.



చదవునేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

వైభవంగా తాళ్లపాక అన్నమాచార్య జయంతి



విజేతలు, సత్కార గ్రహీతలతో అతిథులు

తెనాలి: శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 615వ జయంతి ఉత్సవాలు ఆదివారం స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా కేంద్రం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి అర్చన చేశారు. అనంతరం దాదాపు వంద మంది అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఏప్రిల్ 30న గీతా మందిరంలో జరిగిన అన్నమాచార్య సంకీర్తన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైష్ణవి జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించిన సభలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలరు గొడవర్తి సాయి హరేరామ్, లక్కరాజు లక్ష్మణరావు, నృత్య గురువు పెసర్లంక వసంత దుర్గల అన్నమయ్య పద కవితా సౌరభం గురించి ప్రసంగించారు. శ్రీమాన్ పంచాంగం రామానుజాచార్య స్వామి, డాక్టర్ డి.జీవనలత, జి.నిర్మల రమేష్, వంగల మాధవ రావును సత్కరించారు. బహుమతి పొందిన చిన్నారుల్లో మానసవీణ, అందే తన్మయి, కంకిపాడు పరంజ్యోతి, జమ్ముల నాగ ప్రణీత, నూకల భావన, మారా లలిత కుమారి, సుచరిత, వంకధార సుజాత, యడ్లపల్లి సుధాకర్, బొంతల శాంతి ప్రభృతులున్నారు. కొండపి శ్రీనివాసరావు, వసుంధర పర్యవేక్షించారు.

ముగిసిన బండ్లమ్మ కొలుపులు



నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

- అమ్మవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు
- విజయేశ్వరిదేవిగా దర్శనం



విజయేశ్వరీదేవి అలంకరణలో బండ్లమ్మ

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ కొలుపులు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 3 నుంచి అమ్మవారి వార్షిక కొలుపులను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బండ్లమ్మ అమ్మవారికి పంటలు బాగా పండాలని, వ్యాపారాలు లాభసాటిగా సాగాలని కోరుతూ ప్రజలు వందల ఏళ్లుగా పూజలు చేస్తున్నారు. ఆదివారం అమ్మవారిని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించి, కొబ్బరి కాయలు సమర్పించారు. పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, అమ్మవారికి సమర్పించారు. డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారికి ప్రదక్షిణలు చేశారు. చెరుకుపల్లి మండలం కుంచలవారిపాలెం గ్రామం నుంచి పసుపు బండ్లు అధిక సంఖ్యలో వచ్చాయి. విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రభలను దేవాలయానికి తీసుకొచ్చారు. అమ్మవారి కొలుపులు ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో మహా నివేదనలు, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారు శ్రీ విజయేశ్వరీ మహాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి, పెను గొండ బాలకృష్ణమూర్తి, బుద్దా సాయిబాబు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

మంటల్లో సగ భాగం కాలిపోయిన యువకుడు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో నిదురిస్తున్న ఓ యువకుడు మంటల్లో సగభాగం కాలిపోయాడు. వివరాల మేరకు.. ఆదివారం రాత్రి అమర్తలూరి సౌదామణికి చెందిన పూరింట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఆమె సోదరుడు కత్తి గాబ్రియేల్, కుమారుడు రవికుమార్(చంటి) నిద్రిస్తున్నారు. మంటల్లో చంటి చిక్కుకుపోయి సగ భాగం కాలిపోయాడు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో ఇంట్లో నుంచి అరుపులు రావడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమయ్యి.. మంటల్లో చిక్కుకున్న చంటిని బయటకు తీసుకువచ్చారు. వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. మంటల్లో చిక్కుకున్న చంటిని మెరుగైన చికిత్స కోసం తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. సౌదామణి ఇంట్లోని సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. రేపల్లె అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

వేడుకగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

నిజాంపట్నం: గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకోవడం వల్ల ప్రజలు పాడి పంటలు, అష్ట ఐశ్వర్యాలతో ఉంటారని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. కూచినపూడి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ శ్రీరాముని జీవితం ప్రపంచ మానవావళికి ఆదర్శమన్నారు. శేషాచార్యులు బృందం శాస్త్రోక్తంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించింది. అనంతరం నల్లపాటి శివరామకృష్ణ ప్రసాద్ దంపతులు శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పడమటి వెంకటేశ్వరరావు, బొలగాని విజయలక్ష్మి, లంకా కృష్ణకుమారి, కాశేపల్లి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బొర్రావారిపాలెంలో వేంచేసి ఉన్న అంకమ్మతల్లి ఆలయ 6వ వార్షికోత్సవాల్లో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పాల్గొని, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మోపిదేవి హరనాథబాబు, రేపల్లె మున్సిపల్ చైర్మన్ కట్టా మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.